# పుట్టింటి భార్యలు

దాదాపు ఒక సంవత్సరం క్రితం నాకు ఇంకొక అమెరికన్ సిటీ నించీ ఒక అపరిచిత వ్యక్తి ఫోన్ చేశాడు. తనని పరిచయం చేసుకున్నాక 'మీరు నాకు తెలియకపోయినా చనువు తీసుకుంటున్నాను. మన్నించాలి. మీవల్ల నాకొక సహాయం కావాలి. అందుకని' అన్నాడు.

'అదేం ఫరవాలేదు. నేను చెయ్యగలిగిందయితే తప్పకుండా చేస్తాను. నన్నే ఎందుకు అడుగుతున్నారు' అడిగాను నవ్వుతూ.

'మా సోమసుందరంగాడి బాధ చూడలేక. మీవూళ్ళో నాకింకెవరూ తెలీక. నేను కొన్న మీ పుస్తకంలో మీ ఫోన్ నెంబర్ వుంది కనుక... ' అన్నాడు.

ఆయన ఆ మాటలు బాధతో అంటున్నట్టు తెలుస్తూనే వుంది.

నేనూ కొంచెం నొచ్చుకుని 'చెప్పండి' అన్నాను.

'మా సోమసుందరం, అంటే నా స్నేహితుడులెండి, మొన్న ఫోన్ చేశాడు. అతను అనంతపురంలో స్టేట్‌బాంక్‌లో పనిచేసి, రిటైరయి అక్కడే సెటిలయి పోయాడు. ఒక్కత్తే కూతురు. మూడేళ్ళ క్రితమే పెళ్ళి చేశాడుట. అమెరికా వచ్చాక నాకు అతనితో టచ్ పోయింది. అల్లుడు సాఫ్ట్‌వేర్ ఇంజనీరుట. మామగారి ముక్కు పిండి ఇరవై లక్షలు కట్నం కూడా తీసుకుని అమెరికా వచ్చాట్ట. దాదాపు రెండున్నర ఏళ్ళుగా మీ వూళ్ళోనే వుంటున్నాడుట. భార్యని మాత్రం అమెరికా తీసుకురాకుండా ఇండియాలోనే వుంచాడుట. ఇక్కడ ఉద్యోగం పోయిందనీ డబ్బులకి అల్లల్లాడుతున్నా ననీ, డబ్బులు పంపించమనీ వేధిస్తుంటాడుట. నెలకి రెండు వేల డాలర్లు, అంటే ఇండియాలో లక్ష రూపాయలకి కొంచెం తక్కువగా, ఆయన్ని పంపించమనీ, లేకపోతే కాపురం చేయలేననీ బెదిరించి, ఇప్పటిదాకా ఇంకో పది లక్షలు వసూలు చేశాట్ట. తలకు మించిన భారం అవటంతో ఇక ఇవ్వలేనన్నాడుట. పోయిన నెల ఫోన్ చేసి, తనకి విడాకులు కావాలని పట్టుబట్టాడుట' ఆయన చెప్పటం ఆపాడు.

ఇలాటి కథలు అప్పుడప్పుడూ వింటూనే వున్నాను కానీ, మరీ ఇంత దారుణం ఎప్పుడూ వినలేదు. 'అలాగా పాపం. ఇంతకీ ఇది నాకెందుకు చెబుతున్నారు' అడిగాను, నిజంగానే నా సానుభూతిని వ్యక్తపరుస్తూ.

'ఏమీలేదు. మా సోమసుందరంకి ఒక అనుమానం. అతనికి వేరే పెళ్ళి అయిందేమోననీ, అందుకే వాళ్ళ అమ్మాయిని తీసుకురాకుండా నెట్టుకువస్తున్నాడేమో ననీ. అతని పేరు ఫలానా. మీరు అతను అక్కడ ఒంటరిగా వుంటున్నాడా, వేరే పెళ్ళ యిందా మొదలైన విశేషాలు కనుక్కోగలరా? అలా అయితే, విడాకులు ఇవ్వకుండా, కోర్టుకి వెడదామని యన ఉద్దేశ్యం' అన్నాడు ఆయన.

ఆ వ్యక్తి ఎవరో నాకు తెలియకపోయినా, ఒక తెలిసిన ఆయన ద్వారా అతని గురించి వాకబు చేశాను. సామసుందరంగారు భయపడినట్టుగానే, అతను పెళ్ళిచేసుకుని 'భార్య'తో సుఖంగా వుంటున్నాడు. వెంటనే నాకు తెలిసిన సమాచారం

ఆయనకి అందించాను. తర్వాత ఏమయిందీ అన్నది కాదు మనకి ముఖ్యం. అసలు ఇలా ఎందుకు జరిగిందే అని.

ఇది ఎప్పుడో ఒకప్పుడు జరిగే అరుదైన సంఘటన కాదు. నాలుగైదేళ్ళుగా ఇలాటి కథలు వింటూనేవున్నాం. ఇక్కడ లభ్యమయే గణాంకలు చూస్తే ఇండియాలో ఇలాటి కేసుల్లో పంజాబు మొదటి స్థానంలో, ఆంధ్రప్రదేశ్ రెండవ స్థానంలో వున్నా యని తెలుస్తోంది. పంజాబ్‌లో దావ్‌బా ప్రాంతంలో కొన్ని జిల్లాలలో ఇలాటి మోసపో యిన బాధితుల సంఖ్య వేలల్లో వుందిట. మనరాష్ట్రంలో ప్రథమం మన రాజధానిది.

రీటా అనబడే పంజాబీ అమ్మాయి ఇంగ్లాండ్‌లో వుండే పంజాబీ అతన్ని, ఘనంగా కట్నమిచ్చి పెళ్ళిచేసుకుంది. విమానం ఎక్కిన పది నెలల్లో, మళ్ళీ విమానం ఎక్కి తిరిగి వచ్చేసింది. అక్కడికి వెళ్ళిన రోజునించీ ఇంకా డబ్బులు ఎక్కువ తెమ్మని భర్త వేధించటం, కొట్టటం ఆమె భరించలేక వెనక్కి వచ్చేసింది. ఇంకా నయం, చాల మంది అభాగినులలా ఆత్మహత్య చేసుకోలేదు. కొంతమంది అమ్మాయిలు, ఇలా విదేశీ వివాహాలు విరిగిపోయి పుట్టింట్లోనే కలకాలం వుండిపోతున్నారు.

'పుట్టింటి భార్యలు' అని వీళ్ళకి ఇచ్చిన పేరు ఒక పత్రికలో చదివాను. ఇండియాలోని తల్లిదండ్రులకి వీళ్ళ ఆచూకీ అంతు చిక్కకుండా, అడ్రసులూ ఫోన్ నెంబర్‌లూ మార్చేస్తున్నారుట. నాకు వచ్చిన ఫోన్ అలాటి అమెరికా మొగుడ్ని వెతు క్కుంటూ వచ్చిందే మరి కొంతమంది అమెరికా, ఇంగ్లాండ్, కెనడా, దుబాయ్ మొదలైన దేశాల్లో మొగుడి చేత రోజూ దెబ్బలు తింటూ, నానా బాధలూ పడుతూ, అటు ఇండియాలో తల్లిదండ్రులకి చెప్పలేక, ఇటు విదేశాల్లో పోలీసులకి రిపోర్ట్ చేయటానికి ధైర్యం చాలకా జీవశ్చవాల్లా బ్రతుకుతున్నారు. అంతేకాదు, కొంతమంది కయితే, ఇండియాకి వెళ్ళి పోకుండా పాస్పోర్టులు దాచేస్తున్నారుట. ఇండియాకి ఫోన్ చేయకుండా కట్టుదిట్టం చేస్తున్నారు. దానివల్ల ఈ మగ మహారాజులకి లాభం ఏమిటి అనేది ఒక చిన్న ప్రశ్న. లాభాలు చాలవున్నాయి.

వీళ్ళల్లో దాదాపందరూ, విదేశీ మొగుళ్ళు కనుక లక్షల్లో కట్నాలు గుంజిన బాపతే. కొంతమందికయితే విదేశీ వీసా రాగానే కట్నం మూడు నాలుగు రెట్లు పెరిగి పోతుంది. అంతేకాదు విదేశీయానానికి టిక్కెట్లు కూడా పిల్ల తల్లిదండ్రులే భరిం చాలి. మన తెలుగుదేశంలో ఇలాటివి పైకి చెప్పుకోవటానికి పరువు నష్టం. నామర్దా. అందుకని చాలమంది కిక్కురుమనకుండా పైకి రానీయటంలేదు. మన సోమసుంద రంగారిలా కోర్టుకి వెడదామనుకున్నా అదంత సులభంకాదు. కేసు విదేశీ కోర్ట్‌లోనా, ఇండియన్ కోర్ట్‌లోనా అనేది అంతర్జాతీయ సమస్య. అది వీసాలని బట్టి వుంటుంది. విదేశాలలో కేసు పెట్టాలంటే లాయర్లకీ, కేసు పూర్తయ్యేదాకా అక్కడ వుండటానికీ మిగతా ఖర్చులకీ రూపాయల్లో ఎన్నో లక్షలవుతుంది. అది మరీ డబ్బున్నవాళ్ళకి తప్ప మధ్య తరగతివాళ్ళకి సాధ్యం కాదు. గమ్మత్తు ఏమిటంటే ఇలాటి సమస్యలు మధ్య తరగతి కుటుంబాల్లో ఎక్కువ. అంతకుముందే కట్నాలు లక్షల్లో కుమ్మరించి మునిగి పోయిన వారికి అది అసాధ్యం. కేసు ఇండియాలో పెడదామనుకుంటే, అది తేలేట ప్పటికీ యుగాలు పడుతుంది. లేదా అల్లుడి కట్నాల బాకీకన్నా ఈ లంచాల గిట్నాలు

ఎక్కువవుతాయి.

అమాయకులైన అమ్మాయిలని పెళ్ళి చేసుకునో, పెళ్ళి చేస్తామనో ఆశపెట్టి దుబాయిలో, కువాయిట్లో, సౌదీ అరేబియాలో వాళ్ళని అమ్ముకునే ఏజెన్సీలు హైద్రాబాద్‌లో కొల్లలని వార్తల్లో చదువుతున్నాం. ఆమధ్య అలాటి అమ్మాయిని ఒక ఎయిర్ హోస్టెస్ రక్షించిందని వార్తల్లో వచ్చింది.

అయితే ఈ మోసాలు మగవాళ్ళకే పరిమితమా? కానే కాదు. హైదరాబాద్ నించీ న్యూయార్క్‌లో దిగగానే, ఒకావిడ భర్తని కాదని అంతకుముందే ప్రేమించిన అతనితో వెళ్ళిపోయిందిట. ప్రేమించినతను ముందే అమెరికా వచ్చేశాడు. ఆమెకి ఇక్కడికి రావటానికి వేరే మార్గం దొరకలేదు. వీసా కోసం ఇంకొకతన్ని పెళ్ళి చేసుకుంది. అమెరికా రాగానే, భర్తకి బై చెప్పేసింది.

ఇంతకుముందు ఎప్పుడోకానీ విననివి, ఇప్పుడు ఎందుకు ఎక్కువయాయి? దానికి చాల కారణాలు కనిపిస్తున్నాయి. ఇంతకుముందు అమెరికా ఇంగ్లాండ్ కెనడా దేశాలకి వెళ్ళేవాళ్ళు పైచదువుల కోసం, సాంకేతికంగా ఏదో సాధించటంకోసం వెళ్ళేవాళ్ళు. ఆ రోజుల్లో అలా వెళ్ళేవాళ్ళ సంఖ్య తక్కువ. ఇప్పుడలా కాదు. రకరకాల ఉద్యోగాలు అన్ని దేశాలలో వీరిని ఆహ్వానిస్తున్నాయి. విదేశీయానం గుంటూరునించీ విజయవాడ వెళ్ళినంత సులభంగా మారిపోయింది. మనుష్యుల్లో కట్నాల కాపీనం, డబ్బు కాపీనం విపరీతంగా పెరిగిపోయింది. ఒకనాటి ఆధాత్మిక భారతదేశం, ఏనాడు పడమటి దేశాల కన్నా భౌతిక సుఖాలకి ఎక్కువగా బానిస అయిపోయింది. బాంధవ్యాలకన్నా లక్ష్మీదేవి మీదే బంధుత్వం ఎక్కువయింది. మోసాలు చేసే వాళ్ళని శిక్షించాల్సినవాళ్ళూ, అమాయకులనీ రక్షించాల్సినవాళ్ళూ లంచాలకి లొంగిపోయారు. కొంతమంది అమెరికా నించీ ఆదివారం ఇండియా వచ్చి, సోమ మంగళవారాల్లో ఏడుగురిని చూసి, బుధవారం తాంబూలాలూ, శనివారం పెళ్ళీ చేసుకుని ఆదివారం మళ్ళీ అమెరికా వెళ్ళిపోతున్నారు. పదేళ్ళల్లో పాడయిపోయే కలర్ టీవీ కొనుక్కోటానికే రెండు నెలలపాటు అన్ని షాపులూ తిరిగేవాళ్ళు, జీవిత కాలం నిలవవలసిన వివాహానికి ఎందుకు ఇంత హడావిడి పడుతున్నారు? ఇవీ నా ఆలోచనా పరిధిలోకి వచ్చిన కారణాలు. మీకు తట్టినవి మీరు వ్రాసుకోండి.

మరి ఇవన్నీ చదివి, విదేశీ పెళ్ళికొడుకులంతా మోసగాళ్ళే అనుకోవద్దు. అది నిజమూ కాదు, నా అభిప్రాయమూ కాదు. కానీ ఇలాటివి జరుగుతున్నాయి. మన జాగ్రత్తలో మనం వుండకపోతే, అలా దెబ్బ తినేది మనమే అయే అవకాశాలున్నాయి. అందుకే బంధుమిత్రుల్లో ఎవరైనా విదేశాల్లో వున్న సంబంధాలు కనుక్కోమంటే, ముందు నేను ఇచ్చే సలహా తొందర పడవద్దని. మంచీచెడూ బాగా విచారించకపోతే, తరువాత విచారించవలసి వస్తుందని. చక్కగా చదువుకుని, మంచి ఉద్యోగాల్లో వున్న సంబంధాలు విదేశాల్లో కన్నా ఇండియాలోనే ఎక్కువగా వున్నాయి.

ఈ పుట్టింటి భార్యలు అనే పదం మన తెలుగులోకి ఎంత త్వరగా వచ్చిందో, అంత తొందరగా తుడిపేయటం అవసరం.

0 0 0